ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY నంద్యాల జిల్లా వార్తలు 5
గురువారం 20 మార్చి 2025

రంజాన్ వేళలు	ఇఫ్తార్ గురువారం	సెహరి శుక్రవారం
కర్నూలు	6:34	5:00
నంద్యాల	6:31	5:00



పెద్ద ప్రపంచంలో బుల్లి పిట్ట

ఈ విశాలమైన ప్రపంచంలో బుల్లిపిట్టకు కొండంత కష్టం వచ్చిపడింది. తెల్లవారక ముందే చెట్ల మీద, ఇంటి ముంగిట కీచ్‌కీచ్‌మంటూ కనిపించే ఊరపిచ్చుకలు పట్టణీకరణ, కాలుష్యం, రేడియేషన్ ప్రభావాలతో అంతరించిపోతున్నాయి. ప్రపంచాభివృద్ధిలో పిచ్చుకలు సమిధలవుతున్నాయి. పల్లెసీమల్లో కుటుంబ సభ్యులుగా భావించే పిచ్చుకలు రాబోయే రోజుల్లో కనిపించకపోయే ప్రమాదం ఉంది. పిచ్చుకల కోసం వరి, సజ్జ, జొన్న కంకులను ఇళ్లలో వేలాడదీసేవారు. ఇప్పుడు పూర్తి అననుకూల పరిస్థితులు ఏర్పడినందు వల్ల పిచ్చుకలను సంరక్షించడానికి ప్రపంచ దేశాలు ముందుకొచ్చాయి. ఏటా మార్చి 20న ప్రపంచ పిచ్చుకల దినోత్సవం నిర్వహించడం ఆనవాయితీ.

● కనుమరుగవుతున్న ఊరపిచ్చుకలు ● పల్లెజనానికి విడదీయరాని అనుబంధం ● నేడు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

ఆత్మకూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నేటి విశాలమైన ఆధునిక ప్రపంచంలో బుల్లిపిట్టకు పెద్దకష్టాలు దాపురించాయి. సెల్‌టవర్ల వినియోగం పెరగడంతో రేడియేషన్ తీవ్రత అధికమైంది. దీని వల్ల పిచ్చుకల ప్రత్యుత్పత్తికి ఇబ్బంది కలుగుతోంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే మరి కొన్నేళ్లలో పిచ్చుల జాతి అంతరించే ప్రమాదం వుంది. పాసర్ డొమెస్టికస్ అనే శాస్త్రీయ నామంతో పిలువబడే ఊరపిచ్చుక రైతులకు అన్ని రకాలుగా మేలు చేస్తూనే వాతావరణ పరిరక్షణలోనూ, ఆహార గొలుసులోనూ తమ వంతు పాత్రను పోషిస్తున్నాయి. కాగా భారతదేశంలో అంతరించిపోతున్న పక్షిజాతుల్లో పిచ్చుకలు మొదటి స్థానంలో వున్నాయంటే పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఇదిలా వుంటే పిచ్చుకల సంరక్షణపై జనంలో చైతన్యానికి తీసుకొచ్చేందుకు భారత తపాలా శాఖ 2010లో పిచ్చుకబొమ్మతో కూడిన రూ.5 స్టాంప్‌ను విడుదల చేసింది. కాగా ప్రతిఏటా ఒక నినాదంతో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. అయితే ప్రపంచీకరణ వల్ల జరుగుతున్న ప్రకృతి వినాశనంలో బలవుతున్న పిచ్చుకలకు నివాళి అర్పించేలా ప్రకృతి చిన్న దూతలకు నివాళి అనే నినాదాన్ని ఈ ఏడాది ఎంపిక చేశారు.

పిచ్చుకలను ఇలా సంరక్షిద్దాం..!

- ఇళ్ల వద్ద పిచ్చుకల నివాసం కోసం పెట్టెలను లేక గూళ్లను ఏర్పాటు చేయాలి
- ఒక పాత్రలో నీటిని వుంచి పక్షులకు అందుబాటులో వుంచాలి. ఆ నీటిని ప్రతిరోజు మార్చివేయాలి. అలాగే ఆహారాన్ని అందుబాటులో వుంచాలి.
- పిచ్చుకలు ఉపశమనం పొందేందుకు వీలుగా మొక్కలను, చెట్లను పెంచాలి.
- గార్డెన్‌లో పురుగులు, కీటకాలు అభివృద్ధి అయ్యేలా పెంటను(మేన్యూర్) చల్లాలి. ఈ కీటకాలు పిచ్చుకలకు ఆహారంగా దోహదపడతాయి.
- వాస్తవానికి పంటపొలాల్లో ఇలాంటి క్రిమికీటకాలను పిచ్చుకలు తినేయడం వల్లే రైతులకు మేలు చేస్తూ.. రైతు నేస్తాలుగా మిగిలాయి.
- పిచ్చుకలు తన ఆవాస గూళ్లలో గుడ్లను పొదిగేటప్పుడు ఎలాంటి అంతరాయం కలగకుండా శ్రద్ధ వహించాలి.
- ప్రధానంగా సెల్‌టవర్లు, రేడియేషన్ ఉత్పత్తి చేసే యంత్రాలను పట్టణాలకు, గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేయడం ఉత్తమం.

ఆ వృద్ధురాలికి పిచ్చుకలే ప్రాణం



చాగలమర్రి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బుట్టలు అల్లుకుంటూ జీవిస్తున్న ఆ వృద్ధ మహిళకు పిచ్చుకలంటే ప్రాణం. ఆమె ఇంట పిచ్చుకలు కిచకిచమంటూ సందడి చేస్తున్నాయి. పిల్లలు దూర ప్రాంతాల్లో సెటిల్ కావడంతో ఒంటరిగా మారిన వృద్ధ మహిళకు కొంత మనశ్శాంతిని మిగులుస్తున్నాయి. అందుకే కన్నబిడ్డల స్థానంలో ఈ చిన్ని పిట్టలను చూసుకుంటూ వృద్ధురాలు మురిసి పోతోంది. చాగలమర్రి గ్రామంలోని పాతబస్టాండు వీధిలో 25 ఏళ్ల క్రితం సుబ్బమ్మ, సుబ్బరాయుడు దంపతులు అద్దె ఇంట్లో నివసించేవారు. వెదురు బుట్టలు అల్లుకుంటూ జీవించేవారు. ఆ ఇంట్లో కొన్ని పిచుకలు గూళ్లు పెట్టుకొని ఉండేవి. ఆ దంపతులు వాటికి రోజూ ఆహారంగా గింజలు చల్లేవారు. తాగేందుకు నీళ్లు పెట్టేవారు. వారికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వారు పెళ్లిళ్లు చేసుకొని వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. దీంతో కొన్నేళ్లకు ఆ వృద్ధ దంపతులు ఎస్సీ కాలనీలో సొంత ఇల్లు కట్టుకొని అందులో చేరారు. అద్దె ఇంట్లో వారు పెంచిన పిచ్చుకల మకాం కూడా కొత్త ఇంటికి మారింది. అయితే అక్కడ గూళ్లు కట్టుకునేందుకు అవకాశం లేకపోవడంతో అట్టపెట్టెలతో వసతి ఏర్పాటు చేశారు. ఆ ఇంటిలో ఎటు చూసినా పిచ్చుకల గూళ్లే కనిపిస్తాయి. ఇటీవలే భర్త మృతి చెందడంతో సుబ్బమ్మ ఒంటరిగా మిగిలింది. పిచుకలే తనకు తోడు, నీడ అన్నట్లుగా జీవిస్తోంది. పిచ్చుకలను కాపాడుకుంటూ ప్రభుత్వం నుంచి వచ్చే పింఛన్‌తో జీవిస్తోంది. కుమారులు, కుమార్తెల వద్దకు పోయి రావాలంటే వారం రోజులకు పైగా పడుతుంది. ఆ వారం రోజులకు సరిపడ నీరు, తిండి గింజలు పిచ్చుకల కోసం ఇంట్లో పోసి వెళుతుంది. ఫ్యాన్ తిరిగితే పిచ్చుకలకు ఇబ్బంది అవుతుందని 20 ఏళ్లుగా ఫ్యాన్ ఆన్ చేయడమే లేదు. ఎండాకాలంలో చిన్న టేబుల్ ఫ్యాన్ వాడుతుంది.



పిచ్చుకల కోసం ఎదురు చూస్తున్న సుబ్బమ్మ



అస్తవ్యస్తంగా పరీక్షలు

- 'పది' పరీక్షల్లో విద్యాశాఖాధికారుల నిర్లక్ష్యం
- నంద్యాల బాలికల ఉన్నత పాఠశాలలో పేపర్ మార్పు
- పగిడ్యాలలో దివ్యాంగురాలికి మొదటి అంతస్తులో పరీక్షా కేంద్రం
- నంద్యాలలో కేంద్రాన్ని తనిఖీ చేయని వైనం
- మౌనంగా కలెక్టర్
- అధికారులపై మంత్రి నారా లోకేశ్ ఆగ్రహం

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో పదో తరగతి పరీక్షల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యాశాఖాధికారుల తీరు విస్మయానికి గురి చేస్తోంది. పరీక్షా కేంద్రాలను సందర్శించి అక్కడి పరిస్థితులను క్షుణ్ణంగా తెలుసుకుని విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి పటిష్ట చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ అందుకు విరుద్ధంగా నంద్యాల విద్యాశాఖాధికారులు వ్యవహరించడంతో పరీక్షల నిర్వహణ లోపభూయిష్టంగా మారింది. పరీక్షల తొలి రోజునే జిల్లాలో అనేక సంఘటనలు జరుగడంతో రాష్ట్రస్థాయి అధికారులు కూడా కదలాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంకా పరీక్షా కేంద్రాల్లో కొందరు ఇన్విజిలేటర్లు వ్యవహరిస్తున్న తీరు బయట చర్చ నడుస్తున్నా అధికారులు ఆయా సెంటర్‌లపై దృష్టి సారించి చర్యలు తీసుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. విద్యాశాఖలో జరుగుతున్న వరుస సంఘటనలపై కలెక్టర్ మౌనంగా ఉన్నారు. జరుగుతున్న పరిణామాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే.

నంద్యాల ఎస్పీజీ సెంటర్‌లో

నంద్యాల ఎస్పీజీ పరీక్షా కేంద్రంలో 180 మంది విద్యార్థులకు గదులు కేటాయించారు. అయితే ఆ గదులు పెచ్చులూడిపోయే పరిస్థితి నెలకొన్నా, బెంచీలు సరిగా లేకపోయినా, అక్కడ అసలు ఒక్క ఫ్యాన్ కూడా లేకున్నా ఆ పాఠశాలను పరీక్షా కేంద్రంగా కేటాయించారు. ఆ కేంద్రాన్ని ఏ విద్యాశాఖాధికారి కూడా పరిశీలించలేదని అక్కడి పరిస్థితి చూస్తే అర్థమైపోతుంది. పరీక్ష మొదటి రోజు విద్యార్థుల తల్లిదండ్రులు ఆ కేంద్రాన్ని చూసి నివ్వెరపోయారు. వెంటనే డీఈవో దృష్టికి తీసుకెళ్లి కేంద్రాన్ని మార్చాలని కోరారు. వారు పరిశీలించి బుధవారం జరిగిన పరీక్షకు పక్కనే ఉన్న కళాశాలలోకి సెంటర్ మార్చారు. కాని ఆ సెంటర్‌ను తనిఖీ చేయని సంబంధిత అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల అనుమానాలకు దారి తీస్తోంది. పరీక్షా సెంటర్‌ను మార్చేశాము...చేతులు దులుపుకున్నాము కదా అనే రీతిలో అధికారులుండడం అత్యంత దారుణం.

మంత్రి నారా లోకేశ్ ఆగ్రహం

నంద్యాల జిల్లా విద్యాశాఖలో జరుగుతున్న పరిణామాలపై మంత్రి నారా లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులపై చర్యలు తీసుకోవాలని డీఈవో జనార్దన్‌రెడ్డిని ఆదేశిస్తూనే ఎక్స్ వేదికగా అసౌకర్యాన్ని ఎదుర్కొన్న దివ్యాంగులందరికీ క్షమాపణ కోరారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు.

బాలికల ఉన్నత పాఠశాలలో....

నంద్యాల బాలికల ఉన్నత పాఠశాలలో ఒక పేపర్‌కు బదులు మరొక పేపర్ ఇచ్చినా వారిపట్ల ఉన్నత విద్యాశాఖాధికారులు మందలింపుతో, వివరణ కోరడంతో పరిమితమయ్యారు. పాఠశాలలో ఇన్విజిలేటర్ 01టి ప్రశ్నాపత్రానికి బదులుగా 03టి పరీక్షా పత్రం ఇచ్చి పరీక్ష రాయించారు. పరీక్ష అయిన రెండు గంటల తర్వాత విద్యార్థి తల్లిదండ్రులు ఇదేంటి ప్రశ్నాపత్రం మారిందని గ్రహించి తమకు తీవ్ర అన్యాయం జరిగిందంటూ విద్యాశాఖాధికారులను ఆశ్రయించారు. అప్పటి వరకు చీఫ్ సూపరింటెండెంట్‌కు గాని, డిపార్ట్‌మెంటల్ అధికారికి గాని ఏ మాత్రం గ్రహించలేదు. ఆ తర్వాత కూడా వారికి కేవలం షోకాజ్ నోటీసులు జారీ చేసి చేతులు దులుపేసుకున్నారు. మరో వైపు విద్యార్థికి న్యాయం చేస్తామంటూ మిన్నకుండిపోయారు.

పగిడ్యాల బాలికల గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రంలో..

పగిడ్యాలలోని బాలికల గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రంలో దివ్యాంగురాలు రాజేశ్వరికి మొదటి అంతస్తులో పరీక్షా కేంద్రాన్ని కేటాయించడంలో విద్యాశాఖాధికారుల నిర్లక్ష్యం..స్పష్టంగా కనిపిస్తోంది. కిందిస్థాయి అధికారుల నిర్లక్ష్య వైఖరితో జిల్లా విద్యాశాఖ అభాసుపాలవుతోంది. విద్యార్థిని తల్లి ఆ దివ్యాంగురాలిని పై అంతస్తుకు మోసుకెళుతోంటే అక్కడ ఉన్న పోలీసు సిబ్బంది, తనిఖీ చేసే ఉపాధ్యాయ సిబ్బంది చూస్తూ మిన్నకుండిపోవడం అమానవీయమనే విమర్శలు వచ్చాయి. ఆ విద్యార్థికి గ్రౌండ్‌ఫ్లోర్‌లో గదిని కేటాయించామని జిల్లా ఉన్నతాధికారి చెబుతున్నా.. అక్కడి పరీక్షా సిబ్బంది నిర్లక్ష్య వైఖరికి అక్కడి సంఘటన నిలువెత్తు నిదర్శనంగా కన్పిస్తోంది.



పరీక్ష కేంద్రం మార్చాలని డీఈవోను వేడుకుంటున్న విద్యార్థి తండ్రి



రెండో పరీక్షకు సెంటర్‌ను మార్చింది ఈ కళాశాలలోకే..

పదో తరగతి పరీక్షకు 367 మంది గైర్హాజరు

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో బుధవారం నిర్వహించిన హిందీ పరీక్షకు 367 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ జిల్లాలో 130 పరీక్షా కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 24785 మంది విద్యార్థులు హాజరుకావాల్సి వుండగా 24,418 మంది హాజరయ్యారని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏడు ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు 16 పరీక్షా కేంద్రాలను పరిశీలించామని, అవాంఛనీయ సంఘటనలేవీ జరుగలేదని అన్నారు. ఆరు సమస్యాత్మక కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామన్నారు.

సార్వత్రిక విద్యాపీఠం పరీక్షలకు 59 మంది గైర్హాజరు

జిల్లాలో సార్వత్రిక విద్యాపీఠం పరీక్షల్లో భాగంగా బుధవారం జరిగిన ఇంగ్లీష్ పరీక్షకు 59 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 9 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షలకు 509 మందికి గాను 450 మంది విద్యార్థులు హాజరైనట్లు డీఈవో తెలిపారు.

స్థానిక ఖాళీలకు ఎన్నికలు..!



- తుగ్గలి, వెల్దుర్తి ఎంపీపీలు ఆదెమ్మ, సరళ రాజీనామాతో ఖాళీ
- మృతి చెందిన జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమాన్
- ఖాళీగా ఆరు ఉప సర్పంచ్ స్థానాలు
- నోటిఫికేషన్ జారీ చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం

కర్నూలు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో ఖాళీ అయిన మండల పరిషత్ అధ్యక్షులు (ఎంపీపీ), ఉప సర్పంచులు, జడ్పీ కో-ఆప్షన్ సభ్యుల స్థానాల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. జిల్లాలో రాజకీయ ఒప్పందంలో భాగంగా తుగ్గలిత, వెల్దుర్తి ఎంపీపీలు రాజీనామా చేశారు. జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమాన్ అనారోగ్యంతో మరణించారు. ఆరు పంచాయతీల ఉప సర్పంచి స్థానాలు ఖాళీగా ఉన్నాయి. షెడ్యూల్‌లో భాగంగా ఈ నెల 23న సభ్యులకు నోటీసులు జారీ చేస్తారు. 27న జరిగే ప్రత్యేక సమావేశంలో మెజార్టీ సభ్యుల ఆమోదంతో ఎంపీపీ, ఉప సర్పంచులను ఎన్నుకుంటారు. పత్తికొండ నియోజకవర్గంలో రాజీనామాలతో ఖాళీ ఏర్పడిన రెండు ఎంపీపీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి రావడంతో రాజకీయ వేడి రాజుకుంది. రాజకీయ ఒప్పందంలో భాగంగా రాజీనామా చేసినా.. వెల్దుర్తి ఎంపీపీ పీఠం కోసం వైసీపీలో పోటీ పడుతుండడంతో క్యాంపు రాజకీయాలకు తెరతీసే అవకాశం లేకపోలేదు.

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు 2020 మార్చిలో జరగాల్సి ఉంటే.. కరోనా కారణంగా వాయిదా పడడంతో 2021 ఆగస్టులో జరిగాయి. సెప్టెంబరులో జడ్పీ, ఎంపీపీ అధ్యక్షులను ఎన్నుకున్నారు. అప్పటి అధికార వైసీపీ నాయకుల అక్రమాలు, దౌర్జన్యాలను నిరసిస్తూ.. నాటి ప్రధాన ప్రతిపక్షం టీడీపీ ఆ ఎన్నికలను బహిష్కరించింది. పలు స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో స్థానిక నాయకులు పోటీ చేసినా.. అధికార బలం, పోలీసులతో భయపెట్టి తమకు అనుకూలంగా మార్చుకున్నారు. దీంతో మెజార్టీ స్థానాలను వైసీపీ దక్కించుకుంది. పత్తికొండ నియోజకవర్గం తుగ్గలి, వెల్దుర్తి మండలం పరిషత్ అధ్యక్ష పీఠాలను నాడు వైసీపీ తమ ఖాతాలో వేసుకుంది. అయితే.. ఈ పదవి కోసం ఆ పార్టీలోనే ఇద్దరు నాయకుల మధ్య పోటీ ఉండడంతో అప్పటి ఎమ్మెల్యే శ్రీదేవి చెరో రెండున్నర ఏళ్ల ప్రకారం పదవీ కాలాన్ని పంచుకున్నారు. ఆ ఒప్పందంలో భాగంగా మొదటి ఎంపీపీ పీఠంపై కూర్చున్న తుగ్గలి ఎంపీపీ ఆదేమ్మ, వెల్దుర్తి ఎంపీపీ బొమ్మన సరళ ఒప్పందం మేరకు రాజీనామా చేశారు. ప్రస్తుతం ఆ మండలాల్లో వైఎస్ ఎంపీపీలు ఇన్‌చార్జి ఎంపీపీలుగా కొనసాగుతున్నారు. బుధవారం నోటిఫికేషన్ రావడంతో ఒప్పందం ప్రకారం పోటీ పడిన రెండో ఎంపీటీసీ సభ్యుడికే ఇస్తారా..? మరో ఎంపీటీసీని ఎంపీపీ పీఠంపై కూర్చోపెడతారా..? అనేది వైసీపీలో చర్చగా మారింది. అయితే.. సంఖ్యా బలం లేకపోవడంతో వైసీపీలో ఏం జరుగుతుందో చూద్దాం..! అంటూ అధికార టీడీపీ ముఖ్యనాయకులు వేచి చూస్తున్నారు.

మళ్లీ పీఠం ఆశిస్తున్న వెల్దుర్తి మాజీ ఎంపీపీ సరళ

వెల్దుర్తి మండల పరిషత్ అధ్యక్ష పీఠం జనరల్ మహిళకు రిజర్వు చేశారు. 17 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. 2021 ఆగస్టులో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలను నాటి ప్రతిపక్ష టీడీపీ బహిష్కరించినా.. స్థానిక టీడీపీ నాయకులు పలు స్థానాలకు పోటీ చేసి నాడు వైసీపీ దౌర్జన్యాలను ఎదురొడ్డి మూడు స్థానాల్లో విజయం సాధించారు. 14 స్థానాలను వైసీపీ దక్కించుకుంది. నాడు ఎంపీపీ పీఠం కోసం వైసీపీ మండల కన్వీనర్ రవీంద్రనాథ్‌రెడ్డి భార్య వెల్దుర్తి-3 ఎంపీటీసీ సభ్యురాలు బొమ్మన సరళ, మాజీ జడ్పీటీసీ సభ్యుడు, వైసీపీ నాయకుడు దేశాయి సమీర్‌కుమార్‌రెడ్డి తల్లి లక్ష్మీదేవి పోటీ పడ్డారు. రాజకీయ ఒప్పందంలో భాగంగా మొదట రెండున్నరేళ్లు బొమ్మన సరళ ఎంపీపీ పదవిలో కొనసాగారు. రెండున్నర ఏళ్లు పూర్తయిన తరువాత ఒప్పందంలో భాగంగా ఆమె రాజీనామా చేశారు. ప్రస్తుతం వైఎస్ ఎంపీపీ రంగయ్య ఇన్‌చార్జి ఎంపీపీగా ఉన్నారు. 27న జరిగే ఎంపీపీలో ఎన్నికల్లో ఒప్పందం ప్రకారం మాజీ జడ్పీటీసీ సభ్యుడు దేశాయి సమీర్‌కుమార్‌రెడ్డి తల్లి ఎల్. నగరం ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మీదేవి ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశం ఉంది. అయితే.. మరోసారి ఎంపీపీ పీఠం తన భార్య సరళకే ఇవ్వాలని వైసీపీ మండల కన్వీనర్ రవీంద్రనాథ్‌రెడ్డి పోటీ పడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీనిపై ఇప్పటికే పత్తికొండ వైసీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవితో చర్చించినట్లు ఆ పార్టీలో ప్రధానంగా చర్చ జరుగుతున్నది. అదే జరిగితే ఎంపీపీ పీఠం కోసం పోటీ అనివార్యం అవుతుంది. ముగ్గురు టీడీపీ ఎంపీటీసీ సభ్యుల మద్దతు కీలకంగా మారే అవకాశం ఉంది.



రామాజింనమ్మ



ఆదేమ్మ



లక్ష్మిదేవి



బొమ్మన సరళ

మిగతా 7వ పేజీలో

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి: ఎస్పీ

నంద్యాల క్రైం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి చార్జిషీట్‌ను కోర్టుకు దాఖలు చేయాలని ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా అన్నారు. బుధవారం నంద్యాలలోని తాలూకా పోలీసుస్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి చెప్పారు. స్టేషన్‌లోని లాకప్ గదులు, రికార్డులను, సీసీ టీవీ కెమెరాలను పరిశీలించారు. స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్‌లో గ్రామాలకు వెళ్లి ప్రజలతో మమేకమై మెరుగైన సేవలందించాలని సూచించారు. స్టేషన్ విధుల్లో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వృత్తిపరమైన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, పరిశీలించి పరిష్కరిస్తానని భరోసా కల్పించారు. అనంతరం తాలూకా సర్కిల్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఎస్పీతో పాటు ఏఎస్పీ మందా జావలి ఆల్ఫోన్స్, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.



నంద్యాల తాలూకా పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ

'కూలీల మృతికి కారణమైన వారిపై చర్యలు'

మహానంది, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మహానంది ఆలయ పరిధిలోని నాగనంది సదనం వసతి గృహం కూల్చివేతలో ప్రమాదవశాత్తు ఇద్దరు కూలీలు మృతి చెందడం బాధాకరమని దేవదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. బుధవారం ఆయన మహానంది ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో నల్ల కాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈఓ యర్రమల్ల మధుతో కలసి ప్రమాదం జరిగిన నాగనంది సదనం ప్రదేశాన్ని పరిశీలించారు. దేవస్థానం ప్రధాన కార్యాలయం చేరుకొని ప్రమాదానికి గల కారణాలను ఈవోతో పాటు ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసులును విచారించారు. ఇందులో కాంట్రాక్టర్‌తో పాటు బాధితుల నిర్లక్ష్యం కూడా ఉందని నిర్ధారించుకొన్నారు. వీరి వెంట డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్, జిల్లా సహాయక కమీషనర్ మోహన్, గ్రూపు దేవాలయాల ఈవో హరిశ్చంద్రారెడ్డి ఉన్నారు.

పెద్దాసుపత్రిలో పాలనా వికేంద్రీకరణ

హ్యూమన్ రిసోర్స్ బాధ్యతలు కేఎంసీ ఏడీకి అప్పగింత



ఏడీలతో సమీక్ష నిర్వహిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పరిపాలనా వికేంద్రీకరణపై సూపరింటెండెంట్ అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింది. బుధవారం సూపరింటెండెంట్ చాంబరులో సూపరింటెండెంట్ డా.కే. వెంకటేశ్వర్లు హ్యూమన్ రిసోర్స్‌పై మాట్లాడారు. కర్నూలు జీజీహెచ్ ఉద్యోగుల జీతాలు, సర్వీసు వివరాలు, ఎఫ్ఆర్ఎస్ వివరాలను ఇక నుంచి కర్నూలు మెడికల్ కాలేజీ ఏడీ అనిల్ కుమార్ రెడ్డి (హ్యూమన్ రిసోర్స్) నిర్వహిస్తారన్నారు. హాస్పిటల్ ఏడీ అడ్మినిస్ట్రేటర్, ఏవో అకౌంటెంట్, సీనియర్ అసిస్టెంట్ (ఐదు మంది) బడ్జెట్‌కు సంబంధించిన వ్యవహారాలు నిర్వహిస్తారన్నారు. ఆసుపత్రి ఫైళ్లపై ఉద్యోగులు నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి రోజు హాస్పిటల్ సూపరింటెండెంట్ కార్యాలయానికి గంట సమయం, మెడికల్ కాలేజీ ఏడీ కేటాయించాలని ఆదేశించారు. తద్వారా ఫైల్స్ త్వరగా పూర్తి అవుతాయన్నారు. ఇందులో కార్యాలయంలో ఉద్యోగుల సీట్లను మార్పు చేయాలని సూపరింటెండెంట్ దృష్టికి తీసుకువచ్చారు. మూడేళ్లకు సీట్లు మార్చాల్సి ఉండగా.. ఏళ్ల తరబడి సీట్లలో ఉన్నారన్నారు. ఈ సమీక్షలో సీఎస్ఆర్ఎంవో డా.బీవీ రావు, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, హాస్పిటల్ ఏడీ మల్లేశ్వరమ్మ, కేఎంసీ ఏడీ అనిల్ కుమార్ రెడ్డి, ఏవో శ్రీనివాసులు, అకౌంటెంట్లు లతీఫ్ బేగ్, ఆళ్ల శ్రీనివాసులు ఉన్నారు.

ఒంటిపూట బడులను నిర్దిష్ట వేళలోనే నడపాలి

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలో ఒంటిపూట బడులను నిర్దిష్ట వేళల్లోనే నడపాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్ పాల్ బుధవారం తెలిపారు. నిబంధనలకు వ్యతిరేకంగా పాఠశాలలను నడిపినట్లు తమ దృష్టికి వస్తే పాఠశాలల మూసివేతకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఒంటి పూట బడులకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన సమయాన్ని కచ్చితంగా పాటించాలని ఆయన ఆదేశించారు.

కృష్ణా నదిలో యువకుడి మృతి

కొత్తపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని సప్తనదుల సంగమేశ్వరం వద్ద కృష్ణానదిలో పడి సందీప్ కుమార్ (23) అనే యువకుడు మృతి చెందాడు. కొత్తపల్లి ఎస్ఐ కేశవ తెలిపిన వివరాల మేరకు.. జూపాడుబంగ్లా మండలం మండ్లెం గ్రామానికి చెందిన పోతురాజు మద్దిలేటి కుమారుడు సందీప్ కుమార్ అదే మండలంలోని తంగడంచ గ్రామానికి చెందిన శివకుమార్ అనే యువకుడితో కలిసి బుధవారం సంగమేశ్వరం దర్శనానికి వచ్చారు. అందులో భాగంగా ఇప్పుడిప్పుడే నది జలాల నుంచి బయల్పడుతున్న పాత సంగమేశ్వర ఆలయం పరిసరాల్లోని కృష్ణా నదిలో సందీప్ కుమార్ ఈత కొడుతూ సెల్ఫీలు తీసుకుంటూ ప్రమాదవశాత్తు నది లోతట్టు ప్రాంతాలకు వెళ్లి గల్లంతయ్యాడు. సమీపంలో తన స్నేహితుడైన శివకుమార్ గట్టిగా కేకలు వేయగా.. సమీపంలో ఉన్న మత్స్యకారులు సంగమేశ్వరం గ్రామస్థులు గల్లంతైన సందీప్ కుమార్‌ను బయటకు తీయగా అప్పటికే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ కేశవతోపాటు సిబ్బంది వెళ్లి వివరాలు సేకరించారు. మృతుని చిన్నాన్న బొజ్జన ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు పోస్టుమార్టం నిమ్మితం తరలించారు.

యువకుడి ఆత్మహత్య

కొలిమిగుండ్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొర్విమాను పల్లెలో తీవ్ర విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన రామదాసు శ్రీరాములు కుమారుడు రామదాసు మహేంద్ర(26) అనే యువకుడు అనంతపురం జిల్లా గుత్తి రేల్వే స్టేషన్ వద్ద అందరూ చూస్తుండగానే రైలు కింద తలపెట్టి అత్యంత దారుణంగా ఆత్మహత్య చేసుకున్నాడు. గత ప్రభుత్వంలో వలంటీరుగా విధులు నిర్వహించిన మహేంద్ర కొద్ది కాలంగా యాడికి మండలంలోని బోయరెడ్డిపల్లె ఆదానీ పెన్నా సిమెంట్ పరిశ్రమలో ప్యాకింగ్ విభాగంలో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం డ్యూటీ ముగించుకొని నేరుగా గుత్తికి వెళ్లి ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు స్థానికులు వెల్లడిస్తున్నారు. కాగా ఆన్‌లైన్‌లో బెట్టింగ్ యాప్‌లు, ఇతర దురలవాట్ల ద్వారా తీవ్రంగా నష్టపోయిన మహేంద్ర దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది.

'స్థానిక' ఖాళీలకు ఎన్నికలు..!

5వ పేజీ తరువాయి

తుగ్గలి ఎంపీపీ పీఠం ఏకగ్రీవమేనా..?:

తుగ్గలి ఎంపీపీ పీఠం ఏకగ్రీవం అవుతుందా..? ఇక్కడా కూడా పోటీ తప్పదా..? అనే చర్చ జరుగుతున్నది. ఈ మండలంలో 17 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ఎంపీపీ పీఠం బీసీ మహిళకు రిజర్వు చేశారు. తుగ్గలిలో ఓ స్థానం మినహా.. 16 స్థానాలకు టీడీపీ పోటీ చేసినా అప్పటి అధికార పార్టీ వైసీపీ నేతల దౌర్జన్యాలు, పోలీసుల బెదిరింపులతో 17 స్థానాలు ఆ పార్టీలనే దక్కించుకుంది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు నుంచి వైసీపీ మండల సచివాలయ కన్వీనర్ హనుమంతు భార్య శభాష్ పురం ఎంపీటీసీ సభ్యురాలు రామాంజినమ్మ ఎంపీపీ అభ్యర్థిగా ప్రచారం చేశారు. ఎంపీపీ ఎంపికకు ముందు అనూహ్యంగా అప్పటి ఎమ్మెల్యే శ్రీదేవి సమీప బంధువు వైసీపీ నాయకుడు జగన్నాథ్‌రెడ్డి తన స్వగ్రామమైన పగిడిరాయి ఎంపీటీసీ ఆదెమ్మను తెరపైకి తెచ్చారు. దీంతో ఎంపీపీ పదవీ కాలాన్ని ఇద్దరికి రెండున్నరేళ్ల చొప్పున పంచుకొని ఒప్పందం చేసుకున్నారు. అందులో భాగంగా మొదట ఎంపీపీగా బాధ్యతలు చేపట్టిన ఆదెమ్మ రెండున్నరేళ్లు ముగిసిన వెంటనే రాజీనామా చేశారు. ప్రస్తుతం వైఎస్ ఎంపీపీ ఎర్రనాగప్ప ఇన్‌చార్జి ఎంపీపీగా కొనసాగుతున్నారు. తాజాగా నోటిఫికేషన్ రావడంతో ఒప్పందం ప్రకారం వైసీపీ హనుమంతు భార్య రామాంజినమ్మ ఎంపీపీగా బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. ఒప్పందం ప్రకారం ఎంపీపీగా ఎన్నికైతే.. ఆ పదవిలో దాదాపు ఏడాదిన్నర ఉంటారు. అయితే.. ఆ పార్టీలో ఇతరులు కూడా ఎంపీపీ పీఠం కోసం తెరవెనుక యత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

జడ్పీ కో-ఆప్షన్, ఆరు ఉప సర్పంచ్ స్థానాలకు..

కర్నూలు జిల్లా పరిషత్ (జడ్పీ) కో-ఆప్షన్ సభ్యుడిగా వెలుగోడుకు చెందిన సయ్యద్ సులేమాన్‌ను నాడు వైసీపీ జడ్పీటీసీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనారోగ్యంతో ఆయన మరణించడంతో ఖాళీ ఏర్పడింది. 53 మంది జడ్పీటీసీ సభ్యులు వైసీపీకి చెందిన వారే కావడంతో కో-ఆప్షన్ సభ్యుడి ఎన్నిక ఆ పార్టీ అభ్యర్థి ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉంది. అలాగే.. వివిధ కారణాలతో ఖాళీగా ఉన్న దేవనకొండ మండలం వెలమకూరు, ఓర్వకల్లు మండలం బ్రాహ్మణపల్లి, గుట్టపాడు, పత్తికొండ మండలం జూటూరు, ఆలూరు మండలం మొలగవల్లి, కర్నూలు మండలం సుంకేసుల ఉప సర్పంచులను ఈ నెల 27న ఎన్నుకోవాల్సి ఉంది.

గద్దెరాళ్ల మారెమ్మ మహోత్సవం

అంబరాన్నంటిన జాతర సంబరాలు



బోనాల ఊరేగింపు



ఆలయంలో మారెమ్మవ్వ

దేవనకొండ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : చల్లని దీవెనలతో పాడి, పంటలు, ఆయురారోగ్యాలతో చల్లంగా చూడమ్మా.. మారెమ్మా.. అంటూ భక్త జనసందోహంతో గద్దెరాళ్ల మారెమ్మ సంబరం అంబరానంటింది. బుధవారం తెల్లవారుజామున మారెమ్మవ్వకు దున్నపోతుని బలి ఇచ్చారు. దేవాలయ అధికారి వీరయ్య, గద్దెరాళ్ల గ్రామస్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు మారెమ్మకు నైవేద్యం (చల్ల)తో కూడిన బోనాలు, చీర, సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రెండేళ్లకోసారి జరిగే దేవర వేడుకకు నిర్వహించేందుకు జిల్లా నుండే కాక కర్నాటక, మహారాష్ట్ర, తెలంగాణ, ప్రాంతాల నుండి తరలివచ్చారు. మంగళవారం సాయంత్రం నుండి అర్ధరాత్రి వరకు వాహనాల రాక గద్దెరాళ్లకు కొనసాగింది. దాదాపు లక్షన్నర జనం అమ్మవారిని దర్శించుకున్నారు. ట్రాఫిక్ సమస్య రాకుండా సీఐ వంశీనాథ్ సిబ్బందితో పర్యవేక్షించారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి : కలెక్టర్



కర్నూలు కలెక్టరేట్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారం అందించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల అంశాలపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలోనే కాకుండా అంతకుముందు కూడా ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ, క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం, అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, మార్పు వంటి ఎన్నికల అంశాలపై తగిన సలహాలు, సూచనలు తీసుకొని అందుకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని భారత ఎన్నికల సంఘం ఆదేశించిందన్నారు. ఆ మేరకు ఇకపై ప్రతి నెలా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను తీసుకొని ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బూత్‌స్థాయి అధికారుల ఖాళీలు ఉంటే వాటన్నింటినీ కూడా భర్తీ చేస్తామని చెప్పారు. బీఎల్‌వోలు, ఫామ్ 6, 7, 8, 6ఏలను పరిశీలించుకుని వాటిపై అవగాహన పెంచుకోవాలని, కొత్తగా ఓటర్లను నమోదు చేయించడం, పర్మనెంట్‌గా మైగ్రేట్ అయిన వారి ఓట్లను, చనిపోయిన వారి ఓట్లను తీసివేయించడం వంటి అంశాలపై దృష్టి పెట్టే విధంగా వారికి సూచనలు ఇవ్వాల్సిందిగా రాజకీయ పార్టీలను కోరారు. ట్రాన్స్‌జెండర్ల ఓటర్ల సంఖ్య చాలా తక్కువగా ఉందని విభిన్న ప్రతిభావంతులు, సంక్షేమ శాఖ వద్ద ఉన్న ట్రాన్స్‌జెండర్ల లిస్టుతో సరిపోల్చుకుని, ఓటరు లిస్టులో లేని వారిని చేర్పించేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో వెంకటనారాయణమ్మ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి, టీడీపీ తరఫున ఎల్‌వీ ప్రసాద్, బీజేపీ తరుఫున సాయిప్రదీప్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరఫున బజారన్న, జనసేన సుబ్బయ్య పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి ఇద్దరి మృతి



అష్రఫ్ అలీ (ఫైల్)

ఉయ్యాలవాడ/చిప్పగిరి మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఉయ్యాలవాడ, చిప్పగిరి మండలాల్లో ఈతకు వెళ్లి ఇద్దరు మృతి చెందారు. ఉయ్యాలవాడ మండలంలోని నర్సిపల్లె గ్రామ సమీపంలోని కుందూ నదిలో ఈతకు వెళ్లి ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన కొత్తపల్లి అష్రఫ్ అలీ(18) మృతి చెందాడు. మృతుడు అష్రఫ్ అలీ రంజాన్ మాసం సందర్భంగా గ్రామంలోని మసీదులో నవాజు నేర్పడానికి 15 రోజుల క్రితం గ్రామానికి వచ్చి అక్కడే నివసిస్తున్నాడు. మంగళవారం గ్రామానికి చెందిన మహ్మద్‌రఫీ, దస్తగిరి, కంబగిరిస్వామితో కలిసి కుందూనదికి ఈతకు వెళ్లారు. ఈత కొడుతూ మోటర్ల కోసం ఏర్పాటు చేసిన గుంతలో ప్రమాదవశాత్తు పడి మునిగిపోయాడు. మిగతావారు గ్రామస్తులకు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వటంతో వారు గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. బుధవారం టీడీపీ మండల కన్వీనర్ బోరెడ్డి శేఖర్‌రెడ్డి, నర్సిరెడ్డి ఉయ్యాలవాడ గ్రామం నుండి శ్రీను, గని వెంకటేశ్వర్లు, వగరు వెంకటేశ్వర్లు అనే ముగ్గురు గజ ఈతగాళ్లను రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. వారు మృత దేహాన్ని బయటకు తీశారు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యాశాలకు తరలించారు. మృతుడి తండ్రి అహ్మద్ అలీ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

చిప్పగిరిలో బాలుడు..




సుభాష్ (ఫైల్)

మండల కేంద్రమైన చిప్పగిరిలోని పెద్ద బావిలో ఈతకు వెళ్లిన యువకుడు సుభాష్ (14) మృతి బుధవారం చెందాడు. ఈతకు వెళ్లిన బాలుడు బావిలో మునిగిపోవడంతో పోలీసులు, ఫైర్ సిబ్బంది గాలింపు చేపట్టారు. చిప్పగిరి గ్రామానికి చెందిన రోషప్పగారి నాగవేణి, సత్యన్న దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. ప్రథమ కుమారుడు అయిన సుభాష్ ఈతకు వెళ్లి మృతితో చిప్పగిరిలో విషాదం నెలకుంది. సంఘటన స్థలాన్ని తహసీల్దార్ ఇజాజ్ అహమ్మద్, సీఐ శంకర్ రెడ్డి, ఎస్సై సతీష్ కుమార్ పరిశీలించారు. గుంతకల్ ప్రభుత్వం ఆసుపత్రిలో చికిత్స చేసి బంధువులకు శవాన్ని అప్పగించారు.

శ్రీశైలం డ్యాంలో తగ్గుతున్న నీటి మట్టం

ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పాదన



డ్యాం ముందు భాగం

సున్నిపెంట, మార్చి 19(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం డ్యాంలో రోజురోజుకూ నీటి మట్టం తగ్గుతోంది. డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా నీటి సామర్థ్యం 215 టీఎంసీలు. బుధవారం సాయంత్రం 6గంటల సమయానికి డ్యాం నీటిమట్టం 840.10 అడుగులు కాగా, నీటి సామర్థ్యం 61.9240 టీఎంసీలుగా నమోదైంది. కుడి గట్టు విద్యుత్ కేంద్రంలో ఎలాంటి విద్యుత ఉత్పాదన జరగడం లేదు. అయితే తెలంగాణాకు చెందిన ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో అవసరాన్ని బట్టి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పాదన అనంతరం దిగువ నాగార్జున సాగర్‌కు డ్యాంకు 14,126 క్యూసెక్కుల నీటిని విడుదల జరుగుతోందని నీటిపారుదల అధికారులు తెలిపారు.

సునీతా విలియమ్స్‌కు శుభాకాంక్షలు

ఎంపీ బస్తిపాటి



కర్నూలు అర్బన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): వెల్కమ్ టూ అర్త్ సునీతా విలియమ్స్ అంటూ ఎంపీ బస్తిపాటి నాగరాజు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం డిల్లీలో పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొంటున్న ఆయన ఒక ప్రకటన ద్వారా స్వాగతం పలికారు. గత ఏడాది జూన్ 5న వారం రోజుల పరిశోధనల కోసం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన భారత సంతతికి చెందిన వ్యోమగామి సునీతీ విలియమ్స్ అక్కడే చిక్కుకున్నారు. ఆమె రాక కోసం దేశ ప్రజలందరూ ఎంతో ఉత్కంఠంగా ఎదురు చూశారని, ఆమె సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో అయితే యజ్ఞం, పూజలు నిర్వహిచారని తెలిపారు. తొమ్మిది నెలల తర్వాత సునీత భూమిపైకి చేరుకోవడంతో యావత్తు దేశ ప్రజలందరూ సంతోష పడుతున్నారని ఎంపీ తెలిపారు.

రెండు ఉప సర్పంచ్ ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్

నంద్యాల, మార్చి19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖాళీగా ఉన్న రెండు ఉప సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని డోన్ మండల పరిధిలోని కొత్త పల్లి పంచాయతీ ఉప సర్పంచ్‌గా గత ప్రభుత్వం హయాంలో పని చేసిన బడా హరాసేన్ సాహెబ్ కూటమి అధికారంలోకి రాగానే.. సదరు ఉప సర్పంచ్ పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేసి వార్డు మెంబర్‌గా కొనసాగుతున్నారు. ఇదే క్రమంలో గడివేముల మండలం పెసరవాయి గ్రామ ఉప సర్పంచ్ సాయిసుధ కూడా స్వచ్ఛందంగా రాజీనామా చేసి వార్డు మెంబర్‌గా కొనసాగుతున్నారు. దీంతో సదరు ఉప సర్పంచ్ పదవులను ఖాళీగా చూపిస్తూ జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదించారు. దీంతో తాజాగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు ప్రకారం.. సదరు ఉప సర్పంచ్ పదవులకు ఈ నెల 27వ తేదీన ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఉప సర్పంచ్‌లను ఎన్నుకుంటారు. కొత్తపల్లి పంచాయతీలో మొత్తం 10 వార్డులు, పెసరవాయి పంచాయతీలో 12 వార్డులు ఉండగా.. త్వరలో జరిగే ఎన్నికతో ఆయా ఉప సర్పంచ్ పదవులకు టీడీపీ మద్దతుదారులైన వార్డు మెంబర్లను ఉపసర్పంచ్‌గా మిగిలిన వార్డు మెంబర్లు ఎన్నుకునే అవకాశం ఉందని సమాచారం.

వలసల నివారణకు చర్యలు

డ్వామా పీడీ వెంకట రమణయ్య

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వలసలు నివారించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టామని డ్వామా పీడీ వెంకటరమణయ్య అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ దాదాపు 90 లక్షల పని దినాలను కల్పించేందుకు కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని అన్నారు. ఇప్పటికే 84 లక్షల పని దినాలను కూలీలకు రైతులకు కల్పించామని చెప్పారు. పనులు చేసే చోట కూలీలకు నీడ కల్పించేందుకు తార్పాలిన్లతో పాటు అందుబాటులో ఉన్న వాటిని ఏర్పాటు చేస్తున్నామని, అదేవిధంగా మంచినీళ్ల ప్యాకెట్లు పని చేసే చోట అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించినట్లు స్పష్టం చేశారు. కూలీలతోపాటు రైతులు పని చేసే సమయంలో ఎటువంటి ఇబ్బందులకు గురి కాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జనవరి మొదటి వారం నుంచి కూలీల డబ్బులతో పాటు మెటీరియల్ ఖర్చు కింద నిధులు అందలేదని, త్వరలోనే అందుతాయని, వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామన్నారు.

ఫారంపాండ్స్ నిర్మాణానికి భూముల పరిశీలన



పూడిచెర్లలో భూములు పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, అధికారులు

ఓర్వకల్లు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడిచెర్ల, హుశేనాపురం తదితర గ్రామాల్లో బుధవారం జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్యతో పాటు నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, డ్వామా పీడీ వెంకటరమణయ్య భూములను పరిశీలించారు. ఈ నెల 22న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫారంపాండ్స్ నిర్మాణానికి భూమి పూజకు వస్తారన్న నేపథ్యంలో భూములను పరిశీలించారు. అయితే పూడిచెర్ల బస్టాండు సమీపంలో పూడిచెర్ల గ్రామానికి చెందిన సూర రాజన్న పొలంలో ఫారంపాండ్ నిర్మాణం కోసం భూమిని పరిశీలించారు. అయితే ఆ రైతు సానుకూలంగా స్పందించడంతో అక్కడే ఫారంపాండ్స్‌కు డిప్యూటీ సీఎం భూమి పూజ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఫారంపాండ్స్ చేపట్టాలన్న లక్ష్యంతో పవన్ కళ్యాణ్ వస్తున్నారని అధికారులు వెల్లడించారు. వీరి వెంట తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఏపీడీ లక్ష్మన్న, ఏపీవో కుమార సాయినాథ్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఎరువుల అక్రమ రవాణాపై నిఘా: అగ్రి డైరెక్టర్

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రసాయన ఎరువులు పక్కదారి పట్టకుండా నిరంతర నిఘా ఉంచాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులు, రైల్వే వ్యాగన్ రేక్ పాయింట్ అధికారులతో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వచ్చే ఖరీఫ్ అవసరాల కోసం ఎరువులను బఫర్ స్టాక్‌ను 2లక్షల టన్నులకు పెంచనున్నట్లు చెప్పారు. ఎరువుల రవాణాలో ఖర్చులు అధికంగా ఉంటున్న విశాఖపట్నం, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాలకు మూడు రైల్వే వ్యాగన్ రేక్ పాయింట్లు ఏర్పాటు చేయాలని కేంద్రానికి సీఎం చంద్రబాబు ప్రతిపాదనలు పంపారన్నారు. ఎరువులు సమృద్ధిగా వస్తున్నా.. కృత్రిమ కొరత, అధిక ధరలకు విక్రయం, అక్రమ తయారీ, రవాణా, వ్యవసాయేతర అవసరాలకు వినియోగాన్ని నియంత్రించాలని అధికారులను ఆదేశించారు.

27 నుంచి అగ్రి వర్సిటీలో ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాల రైతులకు నికరాదాయం లభించేలా సాంకేతిక పరిజ్ఞానంపై ఈ నెల 27, 28, 29 తేదీల్లో గుంటూరు జిల్లా లాంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన, సదస్సు జరుగుతుందని వర్సిటీ వీసీ శారదా జయలక్ష్మి తెలిపారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి, లక్షద్వీప్, అండమాన్ రాష్ట్రాలకు ఉపయోగపడే ఈ సదస్సులో సాంకేతిక పరికరాల ప్రదర్శనకు 300 స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు బుధవారం చెప్పారు. కాగా పత్తి సాగు, పరిశోధనలు, భవిష్యత్ వ్యూహాలను చర్చించేందుకు ఈ నెల 21 నుంచి 23 వరకు లాంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో జాతీయ స్థాయి సమావేశం జరుగుతుందని లాం ఫాం అసోసియేట్ డైరెక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు స్పోర్ట్స్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పీఎం యోగా అవార్డు 2025 కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్కూరు సీఈవో వేణుగోపాల్ తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి యోగాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారు అర్హులు అని ఆయన తెలిపారు. 40 ఏళ్ల వయస్సు ఉన్న 20ఏళ్లు యోగాలో అనుభవం ఉండాలన్నారు. జాతీయ స్థాయిలో వ్యక్తిగత సంస్థలు, అంతర్జాతీయ స్థాయిలో వ్యక్తిగత సంస్థల నలుగురుని ఎంపిక చేసి అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 22న అవార్డు ప్రదానం చేస్తారని తెలిపారు. ఈ నెల 31లోపు ఆన్‌లైన్ ద్వారా సెట్కూరు సీఈవో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

కన్నీటిని దిగమింగి పరీక్షకు హాజరు

తండ్రి మృతితో ఓ విద్యార్థి.. తల్లి మరణంతో మరో విద్యార్థి



పరీక్ష రాసేందుకు వచ్చిన మహమ్మద్ ముజమ్మెల్

ఆలూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తండ్రి మరణంతో విషాదంలోనూ ఓ విద్యార్థికి పరీక్షకు హాజరైన ఘటన కర్నూలు జిల్లాలో జరిగింది. వివరాలివీ.. ఆలూరు పట్టణంలో జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి మహమ్మద్ ముజమ్మెల్ పదో తరగతి పరీక్షలు రాస్తున్నాడు. అయితే మంగళవారం రాత్రి విద్యార్థి తండ్రి నూర్ మహమ్మద్ గుండెపోటుతో మృతి చెందారు. దీంతో ఆ ఇంట్లో విషాదం అలుముకుంది. మహమ్మద్ ముజమ్మెల్ కన్నీటిని దిగమింగుకొని పట్టణంలోని సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ పరీక్ష కేంద్రానికి వెళ్లి బుధవారం పరీక్ష రాశాడు.

తల్లి మృతితో విషాదంలోనూ..

ఆలూరు మండలంలోని మొలగవల్లికి చెందిన విద్యార్థి శివరామకృష్ణ తల్లి శ్రీదేవి మంగళవారం హాలహర్వి మండలంలోని బాపురం సమీపంలో ఎల్లెల్సీ కాలువలో పడి మృతి చెందారు. అయితే దుఃఖంలోనూ ఆ విద్యార్థి బుధవారం ఆలూరులోని జడ్పీ బాలికోన్నత పాఠశాలకు వెళ్లి పరీక్ష రాశాడు. సాయంత్రం మహిళ అంత్యక్రియలు నిర్వహించారు.

అకౌంట్‌లో డబ్బు మాయం

వెల్దుర్తి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు అకౌంట్‌లో ఉన్న డబ్బు మాయమైన ఘటన వెల్దుర్తిలో చోటుచేసుకుంది. వెల్దుర్తికి చెందిన రేముడూరు రామిరెడ్డికి యూనియన్ బ్యాంక్‌లో సేవింగ్ అకౌంట్ ఉంది. 17వ తేదీ తన ప్రమేయం లేకుండా అకౌంట్ నుండి ఇతరులకు రూ.99 వేలు ట్రాన్స్‌ఫర్ అయింది. ఈ విషయాన్ని పసిగట్టిన రామిరెడ్డి వెంటనే యూనియన్ బ్యాంకుకు వెళ్లి తన అకౌంట్‌ను బ్లాక్ చేశాడు. బుధవారం వెల్దుర్తి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో అభివృద్ధి పనులు



నంద్యాల ఆర్టీసీ బస్టాండ్



దెబ్బ తిన్న సీలింగ్

నంద్యాల మున్సిపాలిటీ మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన నంద్యాల ఆర్టీసీ బస్టాండు రూపురేఖలు మారనున్నాయి. గత కొన్ని రోజుల నుంచి అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం ప్రయాణిలుకు కూర్చునే ప్రాంతంలో ఫ్లోరింగ్ పనులు చేస్తున్నారు. డీఎం గంగాధర్ బుధవారం మాట్లాడుతూ ఫ్లోరింగ్ పనులు ముగిశాక డ్రైన్లు తదితర పనులు మొదలవుతాయన్నారు. బస్టాండ్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. గత కొంతకాలంగా నిర్లక్ష్యానికి గురైన బస్టాండు అభివృద్ధి పనులు మొదలవడంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి



చంద్రశేఖర్ ఆజాద్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

మహానంది, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్ర పరిధిలోని నాగనంది వసతి గృహాల కూల్చివేతల్లో భాగంగా పాల్గొన్న ఇద్దరు కూలీలు ప్రమాదవశాత్తు మృతి చెందిన కుటుంబాలను దేవదాయశాఖ ఆదుకోవాలని శ్రీశైలం నియోజకవర్గం టీడీపీ సమన్వయకర్త, కెసీ కెనాల్ ప్రాజెక్ట్ అధ్యక్షుడు బన్నూరి రామలింగారెడ్డి కోరారు. బుధవారం దేవదాయశాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్‌కు వినతి పత్రం అందచేసారు. క్షేత్రంలో ఇలాంటి సంఘటన జరగడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు నరాల మౌళీశ్వరరెడ్డి, గడ్డం నాగపుల్లయ్య, కంచెర్ల శివ, వేమూరి కేశవరావు, గంగిశెట్టి మల్లిఖార్జున రావు,నందిపల్లి మహేశ్వరరెడ్డిలు పాల్గొన్నారు.

ఆలయాల హుండీ లెక్కింపు

నంద్యాల కల్చరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని ఆంజనేయకోదండరామస్వామి దేవస్థానం హుండీని బుధవారం లెక్కించారు. మూలసాగరం చెన్నకేశవస్వామి దేవస్థానం ఆలయ ఈవో గోపి ఆధ్వర్యంలో హుండీని లెక్కించారు. ఆంజనేయకోదండరామస్వామి దేవస్థానం హుండీని లెక్కించగా రూ.527386 ఒక సంవత్సరానికి గాను వచ్చినట్లు ఆలయ ఈవో వేణునాథరెడ్డి తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో వీఆర్‌ఓ మురళి, అర్చకులు సుబ్బయ్య శర్మ, సిబ్బంది అంజి, మహిళామండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

శాంతినికేతన్ విద్యార్థులకు రాష్ట్రస్థాయి ర్యాంకులు

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో నిర్వహించిన కలాం సైంటిఫిక్ ఆటిట్యూడ్ టెస్ట్‌లో నంద్యాల శాంతినికేత్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని కళాశాల చైర్మన్ సుధాకర్ తెలిపారు. 9వ తరగతి విద్యార్థి డి పవన్‌కుమార్ రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంక్, 6వ తరగతి విద్యార్థి కార్తీక్ రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంకు సాధించారు. పాఠశాల చైర్మన్ సుధాకర్ విద్యార్థులను అభినందించారు.

మినహాయింపు ఇవ్వండి

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 3న ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షల మూల్యాంకనలో 60యేళ్ల వయస్సు ఉన్న, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి మినహాయింపు ఇవ్వాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. బుధవారం డీఈవో జనార్ధన్ రెడ్డికు ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు నగిరి శ్రీనివాసులు, సాంబశివుడు, రవి, రమేష్ వినతిపత్రం అందజేశారు.

స్థలాలు కబ్జాకు గురికాకుండా చూడండి

నందికొట్కూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విలువైన మున్సిపల్ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని వ్యవసాయకార్మికశాఖ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పక్కీర్ సాహెబ్ విమర్శించారు. బుధవారం పట్టణంలోని కబేలా వెనుక భాగంలో ఉన్న మున్సిపల్ స్థలాన్ని కాలనీ వాసులతో కలిసి వ్యవసాయ కార్మికశాఖ సంఘం నాయకులు పరిశీలించారు. పక్కీర్ సాహెబ్ మాట్లాడుతూ ముబారక్ ఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్నటువంటి మున్సిపల్ స్థలంతో పాటు అయ్యప్పస్వామి దేవాలయం సమీపంలోని మున్సిపల్ స్థలాలను కొందరు అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో ఇంతియాజ్, గోకారి, అబ్దుల్లా, మహబూబ్, వహీదా, బిబి, సాలెహన్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

జిల్లాలో ఐదు ప్రత్యేక శక్తి బృందాలు



శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్న పోలీసులు

నంద్యాల క్రైం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఐదు ప్రత్యేక శక్తి బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా బుధవారం తెలిపారు. శక్తి యాప్ గురించి నంద్యాల జిల్లాలో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు ఎస్పీ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రత, రక్షణ కోసం అందుబాటులోకి తీసుకువచ్చిన శక్తి యాప్ ఉపయోగం, సేవలు, నిక్షిప్తం, రిజిస్ట్రేషన్ గురించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. బుధవారం జిల్లా వ్యాప్తం గా 1950 మంది సెల్‌ఫోన్లలో శక్తియాప్ రిజిస్ట్రేషన్‌ను పోలీసు సిబ్బంది చేపట్టినట్లు తెలిపారు. ఆపద సమయంలో మహిళలు, బాలికలు ఈ శక్తియాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని, ప్రతి మహిళ, యువతి, విద్యార్థినులు వారి సెల్‌ఫోన్‌లో ప్లే స్టోర్ నుంచి శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని వ్యక్తిగత వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

● డ్రోన్ కెమెరాలతో నిఘా..

జిల్లాలో జరుగుతున్న పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్‌రాణా తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. జిల్లా కేంద్రంలో ఎస్‌డీపీవో మందా జావలి ఆల్ఫోన్స్ ఆధ్వర్యంలో డ్రోన్ కెమెరాల నిఘాను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.

● రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా బుధవారం తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని విద్యాసంస్థలు, ముఖ్యమైన కూడళ్లలో పోలీసు సిబ్బందితో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడమే గాకుండా ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

బాలికలు అప్రమత్తంగా ఉండాలి

● జూనియర్ సివిల్ న్యాయాధికారి దివ్య



మాట్లాడుతున్న న్యాయాధికారి దివ్య

మిడుతూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): బాలికలు సమాజంలో అప్రమత్తంగా ఉండాలని నందికొట్కూరు జూనియర్ సివిల్ న్యాయాధికారి వి.దివ్య సూచించారు. మిడుతూరులోని కేజీబీవీలో బ్యాడ్ టచ్ గుడ్ టచ్ పై అవగాహన కల్పించారు. బుధవారం జూనియర్ సివిల్ న్యాయాధికారి వి. దివ్య, ఎస్‌ఐ ఓబులేసు పాఠశాలను సందర్శించి విద్యార్థులతో పలు అంశాలతో చర్చించారు. న్యాయాధికారి వి. దివ్య మాట్లాడుతూ ఆడపల్లలు ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా ఉండాలని, ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తిన విషయం కచ్చితంగా తల్లిదండ్రులకు చెప్పాలని సూచించారు. ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఉన్నపుడు 100కు ఫోన్ చేయాలని తెలిపారు. ఎస్‌ఐ ఓబులేసు మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలలో విద్యతో పాటు మంచి అలవాట్లు నేర్చుకుని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ఉమాగైరవాణి, లాయర్ మద్దయ్య, లీగల్ సర్వీస్ స్టాఫ్ మెంబరు ఉమాదేవి, పోలీస్ సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ జైలు తనిఖీ

నందికొట్కూరు: కర్నూలు జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ లీలా వెంకట శేషాద్రి, నందికొట్కూరు కోర్టు జూనియర్ న్యాయాధికారి దివ్యలు నందికొట్కూరు సబ్ జైలును బుధవారం తనిఖీ చేశారు. ఖైదీలకు న్యాయ చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముద్దాయిలు న్యాయవాదిని ఏర్పాటు చేసుకోలేని వారు ఎవరైనా ఉంటే వారికి ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని తెలిపారు.

శ్రీశైలంలో వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఆర్టీవో

శ్రీశైలం, మార్చి 19(ఆంధ్ర జ్యోతి): శ్రీశైలం ముఖద్వారం వద్ద బుధవారం ఆర్టీవో ఏఎస్ఎస్. రెడ్డి వాహనాలు తనిఖీ చేశారు. తెలంగాణ,కర్నాటక, మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల నుంచి శ్రీశైలం వచ్చే ప్రైవేటు వాహనదారులు స్టేట్ ట్యాక్స్ కట్టకుండా, టెంపరరీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు పెట్టుకుని వస్తున్నారని ఏఎస్ఎస్ రెడ్డి అన్నారు. ప్రతి వాహనదారుడు ట్యాక్స్ చెల్లించాలన్నారు. ఉగాది మహోత్సవాలు ప్రారంభం కానున్న సందర్భంగా కర్నూలు, ఆత్మకూరు, దోర్నాల మీదుగా వాహనాల తాకిడి ఎక్కువగా ఉంటుందని, గుంటూరుకు వెళ్లే వాహనాలు నంద్యాల, గిద్దలూరు మీదుగా వెళ్లాలని సూచించారు.

మార్కెట్ యార్డు చైర్మన్‌గా అవకాశం కల్పించండి



మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసిన విక్టర్, సివిల్ సప్లయీస్ డైరెక్టర్ మహేష్‌నాయుడు

నందికొట్కూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు మార్కెట్ యార్డు చైర్మన్ పదవిని తనకు ఇవ్వాలంటూ తమ్మెడపల్లి విక్టర్ విజయవాడలోని పలువురు ప్రముఖ నాయకులను కోరారు. బుధవారం నంద్యాల జిల్లా ఇన్‌చార్జి మంత్రి పయ్యావుల కేశవ్‌ను, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడును కలిసి వినతిపత్రాలు సమర్పించారు. నందికొట్కూరు మార్కెట్ యార్డు చైర్మన్ కేటగిరి పదవి ఓసీ జనరల్‌గా కేటాయించారు. అయితే రాజకీయ కారణాల వల్ల ఎస్సీకి మారుస్తున్నారన్న వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ పదవిని తనకు ఇవ్వాలని కోరినట్లు తెలుస్తోంది. ఆయనతో పాటు సివిల్ సప్లయీస్ రాష్ట్ర డైరెక్టర్ మహేష్‌నాయుడు ఉన్నారు.

ఆసుపత్రి యాజమాన్యాలు అప్రమత్తంగా ఉండాలి

నంద్యాల మున్సిపాలిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రుల్లో జరిగే జనన మరణ నమోదు విషయంలో సంబంధిత ఆసుపత్రుల యాజమాన్యాలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ సహాయ కమిషనర్ వెంకటదాస్, శానిటరీ సూపర్‌వైజర్ మురళీధర్ సూచించారు. డైరెక్టర్ ఆఫ్ బర్త్ & డెత్ రిజిస్ట్రార్ ఆదేశాల మేరకు మంగళవారం నంద్యాల మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని మీ సేవ కార్యాలయంలో సమావేశం జరిగింది. సమావేశంలో ప్రైవేటు వైద్యులతో పాటు డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్, శానిటర్ సూపర్‌వైజర్లు పలు సూచనలు సలహాలు చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివ ప్రసాద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటి వ్యాధుల పట్ల అశ్రద్ధ తగదు

ఆత్మకూరు రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కంటి సమస్యల పట్ల అశ్రద్ధ తగదని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి కంటి వైద్య నిపుణులు డా. జాహ్నవి అన్నారు. గురువారం మండలంలోని ముష్టపల్లి గ్రామంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ బృందం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించి 40 మందికి చికిత్సలు అందించారు. అందులో ఏడు మందికి శుక్లాలు ఉండటాన్ని గమనించి ఆపరేషన్ నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. కార్యక్రమంలో కంటి వైద్యనిపుణులు షేక్షావలి, వైద్యాధికారి పవన్‌కుమార్,సీహెచ్‌వో అహ్మద్‌భాష, ఆరోగ్య కార్యకర్త ఇందిరా ప్రభావతి, ఆశాలు పాల్గొన్నారు.

బాబు, పవన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం



సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రుల చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేస్తున్న మీసేవ ఆపరేటర్లు, నాయకులు

నంద్యాల మున్సిపాలిటీ మార్చి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, లోకేశ్, ఫరూక్ చిత్రపటాలకు మీ సేవ ఆపరేటర్లు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. మీ సేవలను పునరుద్ధరిస్తున్నట్లు విద్యాశాఖ మంత్రి లోకేశ్ అసెంబ్లీలో ప్రకటించడంతో హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండి ఫిరోజ్,12వ వార్డు కౌన్సిలర్ ఖండే శ్యాంలాల్, మీ సేవ ఆపరేటర్లు ఎం. రామసుబ్బయ్య, మీ సేవ బాషా, గోస్పాడు మనోహర్ పాల్గొన్నారు.

కంటి చూపు కోల్పోయిన బాధితుడికి భరోసా

ఈ నెల 9న జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ కైవసం చేసుకోవడంతో పట్టణంలో జరిగిన సంబరాల్లో ప్రమాదవశాత్తు మాబాషా ఒక కన్ను కోల్పోయారు. విషయం తెలుగుసుకున్న టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండి ఫిరోజ్ బాధితుడిని పరామర్శించి అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సీఐటీయూ మద్దతు

నంద్యాల రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్ తలపెట్టిన రెండు రోజుల సమ్మెకు సిఐటీయూ మద్దతు తెలుపుతుందని సీఐటీయూ నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి. యేసురత్నం, ఎ. నాగరాజులు తెలిపారు. 180 రోజుల పనిదినాలను అమలు చేస్తామన్న హామీని నేటికి అమలు చేయలేదన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు బాల వెంకట్ మహమ్మద్ గౌస్, భరణి, నిర్మల, ఎల్లయ్య , శివరాం భాస్కర్, సునీత, రమణకుమారి, రాంనాయక్ పాల్గొన్నారు.

ఒప్పంద ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక సాయం

శ్రీశైలం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానంలో ప్రచురణల విభాగంలో పొరుగుసేవల పద్ధతిపై పనిచేస్తున్న ఫొటోగ్రాఫర్ కె. జయచంద్రుడు గత ఏడాది అనారోగ్యంతో మృతి చెందారు. అదేవిధంగా ఆలయ విభాగం (ఇష్టకామేశ్వరి ఆలయం)లో పొరుగుసేవల పద్ధతిపై పనిచేస్తున్న చిగుర్ల ఈదన్న గత ఏడాది మృతి చెందారు. వారి కుటుంబాలకు బుధవారం దేవస్థానంలో పనిచేసే ఒప్పంద ఉద్యోగులు, పొరుగుసేవల సిబ్బంది వారి ఒకరోజు వేతనాన్ని ఆర్థిక సాయంగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు అందజేశారు.

రైల్వే కార్మికుడు గల్లంతు

పాణ్యం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : పాణ్యం సమీపంలోని వద్దెల వాగులో ప్రమాదవశాత్తు పడి రైల్వే కార్మికుడు గల్లంతైనట్లు పోలీసులు తెలిపారు. బుధవారం రాత్రి పాణ్యం వద్ద రైల్వే పనులు నిర్వహిస్తున్న జార్ఖండ్‌కు చెందిన ఇద్దరు రైల్వే కార్మికులు ప్రమాదవ శాత్తు పడినట్లు తెలిపారు. వీరిలో ఒకరు గల్లంతవగా రాహుల్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. గల్లంతైన కార్మికుని కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

బాల బాలికలకు రక్షణగా పోక్సో చట్టం



మాట్లాడుతున్న సీనియర్ అడ్వకేట్ గరుడాద్రి సుదర్శన్

ఆత్మకూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): బాలబాలికలకు రక్షణగా పోక్సో చట్టం నిలుస్తుందని ప్రముఖ న్యాయవాది గరుడాద్రి సుదర్శన్ తెలిపారు. బుధవారం ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి ఆదేశాల మేరకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో పోక్సో చట్టం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ 18ఏళ్లలోపు బాలబాలికలపై ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడినట్లయితే నేరం తీవ్రతను బట్టి పదేళ్ల జైలు శిక్షణ లేదా యావజ్జీవ కారాగార శిక్ష లేదా మరణ శిక్ష విధించే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ పద్మావతిబాయి, అధ్యాపకులు విద్యాసాగర్, కృష్ణ ఉన్నారు.

చలివేంద్రాలను ఏర్పాటు చేయండి



మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రతను దృష్టిలో వుంచుకుని ఆత్మకూరు పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలతో పాటు చలువ పందిళ్లను ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు రణధీర్ పేర్కొన్నారు. బుధవారం ఆ పార్టీ తరుపున మున్సిపల్ మేనేజర్ రవికుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయం, కొత్తబస్టాండ్, సంగమేశ్వరం సర్కిల్, గౌడ్‌సెంటర్, నంద్యాల టర్నింగ్ తదితర ఏరియాల్లో చలువ పందిళ్లతో పాటు చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సురేంద్ర, వీరన్న, ఇస్మాయిల్, కిరణ్, శివుడు ఉన్నారు.

అదనపు ఆర్థిక సాయాన్ని వినియోగించుకోండి

ఆత్మకూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయంలో గృహాలు మంజూరై నేటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయని లబ్ధిదారులు ప్రభుత్వం ఇస్తున్న అదనపు ఆర్థిక సాయాన్ని వినియోగించుకుని నిర్ధయించిన గడువులోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని నంద్యాల జిల్లా హౌసింగ్ పీడీ హరిగోపాల్ పేర్కొన్నారు. బుధవారం ఆయన ఆత్మకూరు పట్టణంలో పలు లేఔట్లను సందర్శించి గృహనిర్మాణాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో 1307, మండలంలో 553 గృహాలు ఉన్నట్లు చెప్పారు. అర్హులైన లబ్ధి దారులు మే 31వ తేదిలోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్నట్లయితే అదనపు ఆర్థిక సాయం అందనుందని వెల్లడించారు. ఈయన వెంట డీఈఈ నాగరాజు, ఏఈ ఉమామహేశ్వరరెడ్డి ఉన్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

నందికొట్కూరు రూరల్, మార్చి19 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనుల వద్ద సౌకర్యాలు కల్పించాలని సీపీయం జిల్లా నాయకులు నాగేశ్వరరావు అన్నారు. బుధవారం నందికొట్కూరు మండలంలోని కొణిదేళ గ్రామం వద్ద ఉపాధి పనుల పరిశీలించి, కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పనుల వద్ద నీడ, తాగునీరు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

● ఉమ్మడి జిల్లాలో టమోట రైతు ఖరీఫ్‌లో, రబీలోనూ ధరలు లేక బాగా దెబ్బతిన్నారని, టమోటాకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని సీపీయం జిల్లా నాయకులు నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నందికొట్కూరు గ్రామ పొలిమేరలో రైతులు పండించిన టమోటాను సీపీయం బృందం పరిశీలించింది. ప్రభుత్వం అన్నిరకాల పంటలకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రభుత్వమే కోనుగోలు చేయాలన్నారు.

యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా వెంకటేశ్వర్లు



నంద్యాల, మార్చి19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యాదవ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌తో పాటు 15మంది డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వ్యులు జారీ చేసింది. తిరుపతికి చెందిన నరసింహాయాదవ్‌ను సదరు కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించగా.. నందికొట్కూరు నియోజకవర్గం జూపాడుబంగ్లా మండలం తుడిచెర్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, మండల టీడీపీ అధ్యక్షుడు కడియం వెంకటేశ్వర్లుయాదవ్‌ను నియమించారు. ఆయన టీడీపీని స్థాపించినప్పటికి టీడీపీలో ఉంటూ ఎన్నోఏళ్లుగా సర్పంచ్‌గా చేశారు. త్వరలోనే చైర్మన్‌తో పాటు 15మంది డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. తనకు అవకాశం కల్పించిన టీడీపీ అధిష్టానంతో పాటు సీనియర్ టీడీపీ నాయకులు మాజీ శివానందరెడ్డి, ఎమ్మెల్యే జయసూర్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

నిరుపయోగంగా సచివాలయ భవనాలు



కొత్త ముచ్చుమర్రిలో నిరుపయోగంగా ఉన్న సచివాలయ భవనం

పగిడ్యాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్మించిన సచివాలయ భవనాలు నిరుపయోగంగా మారాయి. రూ. 43 లక్షలతో నూతన భవనాలను నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. పగిడ్యాల -3, కొత్తముచ్చుమర్రి -1, పాతముచ్చుమర్రి -1, నెహ్రూనగర్ -2, లక్ష్మాపురం- 2,3 గ్రామాల్లో సచివాలయాలు భవనాలు రూ. పూర్తయి రెండేళ్లనా ప్రారంభించలేదు. అలాగే నెహ్రూనగర్ -1 పాఠశాల ఆవరణలో నిర్మించినందుకు కోర్టు పనులు నిలిపివేశారు. పాతభవనాల్లో సౌకర్యాలు లేక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని భవనాలు శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతున్నాయి. ఎప్పుడు భవనం కూలుతుందోనని సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి నూతనంగా నిర్మించిన భవనాలను ప్రారంభించాలని ఉద్యోగులు, సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.

జోరుగా ఎర్రమట్టి తవ్వకాలు



అంకిరెడ్డి చెరువులో తవ్విన మట్టి

మహానంది, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులపల్లి గ్రామంలోని అంకిరెడ్డి చెరువులో అక్రమంగా ఎర్రమట్టిని తవ్వుతున్నారు. వందల ఎకరాలకు సాగునీరు అందించేందుకు చెరువును ఏర్పాటు చేశారు. అయితే చెరువులో నీరు లేకపోవడంతో యేథచ్ఛేగా కొందరు మట్టి తవ్వకాలు చేపట్టారు. ఈ విషయం మైనింగ్ అధికారులకు తెలిసినా ఏమి తెలియనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇలాగే చెరువును తవ్వుకొని పోతే వర్షాకాలం నీరు ఎలా నిల్వ ఉంటుందోని రైతులు పేర్కొంటున్నారు. ఈ మట్టిని ఇటుకల బట్టీలకు తరలిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎర్రమట్టి తవ్వకాలను అడ్డుకోవాలని గ్రామ ప్రజలు, రైతులు కోరుతున్నారు.

భద్రత ప్రమాణాలు పాటించాలి : జేసీ



నంద్యాల నూనెపల్లె, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో ప్రమాదాలు తలెత్తకుండా భద్రత ప్రమాణాలు పాటించాలని జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పరిశ్రమల శాఖతో జేసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పరిశ్రమల్లో ప్రమాదవశాత్తు ఏదైన ప్రమాదం సంబవించినప్పుడు భద్రత ప్రమాణాలను పాటించాలని, మాక్‌డ్రిల్స్ నిర్వహించే సమయంలో సంబంధిత అధికారులు పాల్గొనేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఏలాంటి పరిశ్రమలు ఉన్నాయి, ఏవిధమైన రసాయనాలు తయారు చేస్తారనే అంశాలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. పరిశ్రమల శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు ఏవిధమైన చర్యలు తీసుకోవాలనే అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో విశ్వనాథ్, జిల్లా విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖాధికారి బాలరాజు, ఎస్‌డీఆర్‌ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సుధాకర్‌రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

టంగుటూరులో ఘనంగా పెద్దమ్మ జాతర



టంగుటూరులో పెద్దమ్మ తల్లికి పూజలు చేస్తున్న టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టంగుటూరు గ్రామంలో పెద్దమ్మ జాతర బుధవారం నిర్వహించారు. గ్రామం నడిబొడ్డున ఉన్న చెన్నకేశవస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పందిరిలో పెద్దమ్మతల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. టంగుటూరు గ్రామ రైతు సంఘం ఆహ్వానం మేరకు టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ పెద్దమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆమె వెంట గ్రామ టీడీపీ నాయకులు ఉన్నారు. మహిళలు బోనాలను తలపై పెట్టుకొని మేళతాళాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకు వెళ్లి నంద్యాల రహదారిలోని పెద్దమ్మ ఆలయం వద్ద విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. బనగానపల్లె సీఐ మంజునాథరెడ్డి, ఎస్ఐ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

రక్తదాన శిబిరం

కోవెలకుంట్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విక్కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో సుమారు 50 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు విక్కిరెడ్డి, నంద్యాల బ్లడ్‌బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణోత్సవానికి ఆహ్వానం

బనగానపల్లె, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుల గ్రామంలో వచ్చేనెల 6నుంచి నిర్వహించనున్న సీతారాముల కల్యాణోత్సవానికి రావాలని మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డికి టీడీపీ నాయకులు షేక్షావలి, బాలనాయుడులు ఆహ్వాన పత్రికను బుధవారం అందించారు. నాయకులు రామకృష్ణ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ట్రాఫికర్

- రైల్వేగేట్లు వేసిన ప్రతిసారి నిలిచిపోతున్న వాహనాలు
- పట్టణంలో వెడల్పు లేని రోడ్లు
- ఇబ్బంది పడుతున్న జనం



డోన్‌లో రైల్వేగేటు పడటంతో నిలిచిన వాహనాలు

డోన్ రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ చట్రంలో డోన్ పట్టణం విలవిల్లాడుతోంది. ట్రాఫిక్ సమస్య నియంత్రణకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా తీవ్రత తగ్గడం లేదు. పట్టణంలోని ప్రధాన రోడ్లు వెడల్పు లేకపోవడం సమస్యకు ఒక కారణంగా భావిస్తున్నారు. పట్టణంలోని బేతంచెర్ల రోడ్డు వెడల్పు లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య రోజు జఠిలమవుతునే ఉంది. బేతంచర్ల రోడ్డు నుంచి పట్టణ నడిబొడ్డులోకి వచ్చే క్రమంలో ఉన్న నంద్యాల, కర్నూలు రైల్వేగేట్లు ట్రాఫిక్ సమస్యను మరింత పెంచుతున్నాయి. నంద్యాల రైల్వేగేట్ల మీదుగా రెండు బ్రాడ్‌గేట్లు లైన్లు ఉండటంతో పది నిమిషాలకొకసారి రైళ్లు, గూడ్సు రాకపో కలు ఉండటంతో గేట్లు మూస్తూ, వేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య జఠిలమవుతుంది. కొంత దూర వ్యత్యాసంలో రెండు రైల్వే గేట్లలో ఏదో ఒకటి వచ్చే రైళ్లు, గూడ్స్ రాకపోకలతో గేట్లు వేస్తుండటంతో వాహనదారులు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవడంతో సమయం వృథా అయ్యే పరిస్థితి కనిపిస్తుంది. అలాగే పట్టణంలోని కంబలపాడు రోడ్డు ట్రాఫిక్ సమస్యకు మరో కారణంగా నిలుస్తుంది. పాతబస్టాండు నుంచి రాజ్‌థియేటర్ రోడ్డు ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. పట్టణంలో జనాభా పెరిగిపోవడం దాదాపు సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు కూడా మోటారు బైకులు ఉండటం, కార్లు, ఆటోల సంఖ్య పెరగడంతో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరుగుతూనే ఉంది. ట్రాఫిక్ సమస్య నియంత్రణకు ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఔట్‌పోస్టు స్టేషన్ ఏర్పాటు చేసి ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేసినప్పటికీ సమస్య తీవ్రత తగ్గడం లేదు.



రైల్వే గేటు పడటంతో ఫ్లైఓవర్ కింద నిలిచిన వాహనాలు

ట్రాఫిక్ సమస్య బారిన పడకుండా ఉండేందుకు వాహనదారులకు ఫ్లైఓవర్ బ్రిడ్జి కొంత ఉపశమనం కలిగిస్తుంది. పట్టణంలోని గుత్తి రోడ్డు నుంచి రెండు రైల్వే గేట్ల మీదుగా కొత్తబస్టాండు ప్రధాన రోడ్డు వరకు 2009లో నాటి ఎమ్మెల్యే కోట్ల సుజాత మ్మ చొరవతో రూ.35 కోట్ల నిధులతో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. 2017లో ప్రారంభిం చారు. అప్పటి నుంచి ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రజలకు, వాహనదారులకు ప్రయోజనకరంగా మారింది. ముఖ్యంగా దూర ప్రాంతాలకు వెళ్లే బస్సులు డోన్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండుకు వచ్చేందుకు ఫ్లైఓవర్ ప్రయోజనకరంగా మారింది.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి



దీర్ఘకాలికంగా డోన్ పట్టణ ప్రజలను పట్టి పీడిస్తున్న ట్రాఫిక్ సమస్యను పాలకులు పరిష్కరించాలి. ట్రాఫిక్ రద్దీగా ఉండే ప్రదేశాలను గుర్తించి రోడ్డు వెడల్పు కార్యక్రమం చేపట్టాలి. రైల్వే గేట్ల సమస్యలను అధికమించేందుకు అనువైన ప్రాంతంలో అండర్ బ్రిడ్జిని ఏర్పాటు చేసి సమస్య లేకుండా చూడాలి.

\- గార్లపాటి మద్దిలేటి, కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త, డోన్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

రాయితీలను సద్వినియోగం చేసుకోండి

- రమణయ్య, ఏఈ, విద్యుత్‌శాఖ



చాగలమర్రి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు ఈనెల 1 నుంచి 31 వరకు అడిషనల్ లోడ్‌పై 50 శాతం, పీఎం సూర్యఘర్ పథకానికి రూ.78 వేలు వరకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ ఏఈ రమణయ్య తెలిపారు. బుధవారం ఆంధ్రజ్యోతితో ఏఈ మాట్లాడారు.

ప్రశ్న: ప్రభుత్వం విద్యుత్ రాయితీలను అందిస్తోందా?

జవాబు: గృహ అవసరాల వినియోగదారులకు ఒక కిలో వాట్ అడిషనల్ లోడ్‌పై 50 శాతం, పీఎం సూర్యఘర్ పథకానికి మూడు కిలో వాట్లకు రూ.78 వేల వరకు రాయితీ వస్తుంది.

ప్రశ్న: సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పిస్తున్నారా ?

జవాబు: మండలంలో ఈ పథకంపై విద్యుత్ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కొందరు గృహ వినియోగదారులు ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని కనెక్షన్ తీసుకోవాలి.

ప్రశ్న: ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఈ పథకం అమలవుతోందా?

జవాబు: ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో లబ్ధిదారులకు సంబంధించిన మొబైల్ నంబర్, ఆధార్, విద్యుత్ బిల్లుకు అనుసంధానం చేయడం, ఇంటి పైకప్పుపై సౌర పలకలు బిగించేందుకు వివరాలు సేకరిస్తున్నాం. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నాం.

ప్రశ్న: స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారా?

జవాబు: గృహాలు కమర్షియల్, ఇండస్ట్రియల్, ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్టు మీటర్లు బిగిస్తున్నాం. ఇప్పటి వరకు 1756 స్మార్ట్ మీటర్లు బిగించాం.

ప్రశ్న: వ్యవసాయానికి ఎన్ని గంటలు విద్యుత్ ఇస్తున్నారు?

జవాబు: వ్యవసాయానికి తొమ్మిది గంటలు నిరంతరంగా విద్యుత్ సరఫరా చేస్తున్నాం. మరమ్మతు పనులు ఉంటే తప్పా అన్ని వేళల్లో సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూస్తాం.

వడదెబ్బతో అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎండవేడిమి అధికంగా ఉండటంతో పశువులకు వడదెబ్బ సోకే ప్రమాదం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్ తెలిపారు. బుధవారం రాంపల్లెలో గాలికుంటు నివారణ టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. పశువులకు రైతులు టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి దీపకుమారి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సంజామల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మంగపల్లె శివార్లలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రమణయ్య బుధవారం తెలిపారు. వీరి వద్ద నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

సునీతా విలియమ్స్ జీవితం స్ఫూర్తిదాయకం

డోన్ రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అంతరిక్షంలో తొమ్మిది నెలలు గడిపి విజయవంతంగా తిరిగి భూమికి వచ్చిన సునీతా విలియమ్స్ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని టీడీపీ పట్టణ యువ నాయకులు వై.హనుమంతరెడ్డి అన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ రోదసిలో ఆమె అనుభవాలను, సైన్స్‌పై ఆసక్తి పెరిగేలా ప్రభుత్వం సునీత విలియమ్స్ విజయగాథలను విద్యార్థులకు పాఠ్యాంశంగా అందించాలని కోరారు.

హాస్టల్ మరమ్మతులకు నిధులు మంజూరు

డోన్ రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): డోన్ సబ్ డివిజన్ పరిధిలోని బీసీ బాలుర, బాలికల సంక్షేమ హాస్టళ్ల మరమ్మతులకు రూ.21 లక్షల నిధులు మంజూరైనట్లు డోన్ అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఓబులేసు అన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ డోన్ బీసీ బాలుర సంక్షేమ హాస్టల్‌కు రూ.2 లక్షలు, బాలికల హాస్టల్‌కు రూ.1.50 లక్షలు నిధులతో పనులు జరుగుతున్నట్లు చెప్పారు. మిగితా నిధులను ఆయా మండలాల్లోని హాస్టళ్లకు కేటాయించినట్లు తెలిపారు. ప్రధానంగా బాత్‌రూమ్‌లు, నీటి కొళాయిలకు సంబంధించిన తదితర సమస్యల పరిష్కారం కోసం ఈ నిధులు ఉపయోగించనున్నట్లు తెలిపారు.

డీపట్టా రైతులకు యూనిక్ నెంబర్ ఇవ్వాలి



ఏవోకు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

ప్యాపిలి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): డీపట్టా రైతులకు యూనిక్ ఐడీ నెంబరు ఇవ్వాలని కలచట్ల రైతులు కోరారు. బుధవారం గ్రామంలోని ఆర్బీకేలో ఏవో రాజేష్‌కు వినతిపత్రం అందజేశారు. తమ పంచాయతీలోని నాలుగు గ్రామాల్లో దాదాపు 500 మంది డీపట్టా రైతులు ఉన్నారన్నారు. యూనిక్ ఐడీ ఉన్న రైతులకే వ్యవసాయ పథకాలు వర్తించే అవకాశాలు ఉన్నందున డీపట్టా భూములను సాగు చేస్తున్న రైతులకు కూడా ఐడీ నెంబర్లు ఇవ్వాలని కోరారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఏవో చెప్పారు. కార్యక్రమంలో రైతులు కలచట్ల ప్రసాద్, రవి, రఘు ఉన్నారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

చాగలమర్రి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని బాలుర, బాలికల, సెయింట్‌ఆన్స్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, దొర్నిపాడు ఎంఈవో మనోహర్‌రెడ్డి, నందికొట్కూరు డిప్యూటీ తహసీల్దార్ మధుసుధాకర్ బుధవారం తనిఖీ చేశారు. మౌలిక వసతులను పరిశీలించారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో 753 మందికి గాను 737 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. వారి వెంట ఎంఈవో అనూరాధ, సీఎస్, డీవోలు ఉన్నారు.

పాఠశాలలో ముగ్గురే విద్యార్థులు



పాఠశాలకు హాజరైన ముగ్గురు విద్యార్థులు

రుద్రవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యల్లావత్తుల గ్రామస్థులు వలస బాట పట్టారు. దాంతో బుధవారం పాఠశాలకు ముగ్గురే విద్యార్థులే హాజరయ్యారు. గ్రామం నుంచి గుంటూరుకు ఎర్రమిర్చి కోతలకు వలస వెళ్లారు. పాఠశాలలో 1, 2 తరగతుల్లో 13 మంది విద్యార్థులు ఉండాల్సి ఉండగా ముగ్గురే మిగిలారు. ఈ విషయంపై హెచ్‌ఎం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు వలసలు వెళ్లడంతో విద్యార్థులసంఖ్య తగ్గిందని తెలిపారు.

'గిరిజనులకు సాగు భూములు ఇవ్వాలి'

రుద్రవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గిరిజనులకు సాగుభూమి ఇవ్వాలని సీపీఎం నాయకుడు రామచంద్రుడు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని చిన్నయ్యస్వామి చెంచుగూడెం, హరినగరం, ఆలమూరు గ్రామాల్లో పర్యటించి గిరిజనుల వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెంచులకు రేషన్‌కార్డులు, ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని, అర్హులైన వృద్ధులకు పింఛన్లు ఇవ్వాలన్నారు.

సీఎం దృష్టికి వాల్మీకుల సమస్య

కొలిమిగుండ్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : వాల్మీకుల సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లిన వాల్మీకి ప్రజాప్రతినిధులకు మహర్షి వాల్మీకీ రిజర్వేషన్ ప్రజాసమితి రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్‌గోపాల్ కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం కొలిమిగుండ్లలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేలు కాల్వ శ్రీనివాసులు, పార్థసారధి, గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్సీ బీటీ నాయుడు సీఎం చంద్రబాబును కలిసి వాల్మీకి ఎస్టీ జాబితా అంశాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారన్నారు.

12 వేల మంది కూలీలకు పనులు

చాగలమర్రి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): క్లస్టర్ పరిధిలో 12 వేల మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారని ఉపాధి హామీ ఏపీడీ సాంబశివరావు తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో టీఏ, ఎఫ్ఏలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మార్చి చివరి నాటికి 15 వేల మంది కూలీలకు ఉపాధి పనులు కల్పించాల్సి ఉందన్నారు. రెండు రోజుల్లో ఉపాధి కూలీల బిల్లులు జమ అవుతాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఏపీవో నిర్మల పాల్గొన్నారు.

శిశు ఆధార్ కేంద్రాలకు విశేష స్పందన

కొలిమిగుండ్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతలాయపల్లె గ్రామంలోని ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ సెంటర్లో బుధవారం నిర్వహించిన శిశు ఆధార్ కేంద్రానికి స్పందన లభించింది. అంగన్‌వాడీ కార్యకర్త భాగ్యలక్ష్మీ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన సుమారు 30మందికి పైగా తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆధార్ నమోదు చేసుకున్నారు.

దంపతులపై దాడి.. కేసు నమోదు

సంజామల, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పేరుసోమల గ్రామా నికి చెందిన దంపతులు చంద్ర ఓబులేసు, విజయలక్ష్మిపై మంగళవారం రాత్రి దాడి జరిగింది. బుధవారం బాధితుల ఫిర్యాదు మేరకు రామిరెడ్డిపల్లెకు చెందిన తలారి ప్రసాద్, పుల్లయ్య, వెంకటరమణయ్య, వెంకట రమణ, మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు.

అదనపు కట్నం కేసు నమోదు

బేతంచెర్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : భర్త, అత్త, మామ అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్నారని బలపాలపల్లి గ్రామానికి చెందిన సుస్మిత అనే మహిళ ఫిర్యాదు చేసిందని ఏఎస్ఐ లింగమయ్య బుధవారం తెలిపారు. దాంతో సదరు మహిళ భర్త సుదాకర్, అత్త నాగేంద్రమ్మ, మామ సుంకన్న, మేనమామలు ఎల్లయ్య, మద్దయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

ప్యాపిలి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మహిళలు చట్టాలపై అవగాహన ఉండాలని డోన్ సబ్ కోర్టు న్యాయాధికారి తంగమణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహిళలకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎస్ఐ మధుసూదన్, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి అ న్నారు. బుధవారం కోవెలకుంట్ల పట్టణంలోని డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన కలిగించారు. న్యాయవాదులు నరసింహ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

చాగలమర్రి: బాలకార్మికుల చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కార్మికశాఖ సహాయ అధికారి మురళీకృష్ణ అన్నారు. బుధవారం హెచ్‌సీ శంకర య్య ఆధ్వర్యంలో బాలకార్మికుల చట్టంపై పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్‌సీపీసీఆర్ ఆదేశాల మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నా మని తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు, కార్మికులు పాల్గొన్నారు.

రూ.6.43 కోట్ల పన్ను వసూలు: డీపీవో



మాట్లాడుతున్న జిల్లా డీపీవో జమివుల్లా

చాగలమర్రి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రూ.10.43 కోట్లు పన్నులు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.6.43 కోట్లు పన్నులు వసూలయ్యాయని జిల్లా పంచాయతీ అధికారి జమివుల్లా తెలిపారు. బుధవారం చాగలమర్రి గ్రామంలోని మూడవ సచివాలయాన్ని తనిఖీ చేశారు. పీ-4 సర్వే, మ్యాన్‌మిస్సింగ్ సర్వే ప్రజా సమస్యల పరిష్కార వేదికలపై ప్రజాభిప్రాయ సేకరణలపై సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సర్వేలను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేసి వివిధ రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ సమన్వయంతో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 15వ ఆర్థిక సంఘం కింద జిల్లాకు రూ.28 కోట్లు మంజూరయ్యాయని, పారిశుధ్యం, తాగునీటి కోసం ఖర్చు చేస్తామని అన్నారు. ప్రైవేటు వేంచర్లలో ల్యాండ్ కన్వర్షన్ అయి ఉంటేనే గ్రామ పంచాయతీలలో ప్లాన్ అప్రూవల్ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో 15 మేజర్ గ్రామ పంచా యతీలు, 489 గ్రామ పంచాయతీలు ఉన్నాయని తెలిపారు. గ్రామ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ తాహిర్‌హుసేన్, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తాం



కేసీ కెనాల్ ప్రధాన కాల్వపై రైతులతో మాట్లాడుతున్న జగత్ విఖ్యాత్‌రెడ్డి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల)/దొర్నిపాడు,మార్చి 19(ఆంధ్రజ్యోతి) : కేసీ కెనాల్ పరిధిలో పంటలు సాగు చేసిన రైతులకు చివరి ఆయకట్టు వరకు తప్పనిసరిగా సాగునీరు అందిస్తామని ఆళ్లగడ్డ నియోజకవర్గ టీడీపీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి తెలిపారు. రబీలో రైతులు సాగుచేసిన పంటలు ఎండిపోతుండడంతో కేసీ ప్రధాన కాల్వ వెంట ఆయన బుధవారం పర్యటించారు. దొర్నిపాడు నుంచి యాళ్లూరు మీదుగా కామినేనిపల్లె 16వ లాక్ వద్ద కేసీలో నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. అనంతరం అయ్యలూరు మీదుగా వెలుగోడుకు చేరుకున్నారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చొరవతో రాజకీయాలకు అతీతంగా ప్రతి రైతుకు సాగునీరు అందిస్తామన్నారు. ఈ మేరకు సంబంధిత శాఖ అధికారులతో విఖ్యాత్‌రెడ్డి మాట్లాడారు. ఆయన వెంట కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు, సాగునీటి సంఘాల అధ్యక్షుడు కమతం లక్ష్మిరెడ్డి, సంగిరెడ్డి నాగేశ్వర రెడ్డి, టీసీ మెంబర్లు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

- **పేదలకు న్యాయ సేవలందించాలి :**

పేద ప్రజలకు న్యాయసేవలందించాలని టీడీపీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి సూచించారు. ఆళ్లగడ్డ సీనియర్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా(ఏజీపీ) నియమితులైన కమతం బాలగురెడ్డి.. యువ నాయకుడు జగత్ విఖ్యాత్ రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట పలువురు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

రైతులు పరిరక్షణ వ్యవసాయం చేయాలి

- సైంటిస్టు డాక్టర్ ప్రతిభ



సమావేశంలో మాట్లాడుతున్న సైంటిస్టు డాక్టర్ ప్రతిభ

బనగానపల్లె, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రైతులు పరిరక్షణ వ్యవసాయం చేయాలని హైదరాబాద్ కేంద్రీయ మెట్ట పరిశోధనా సంస్థ ప్రిన్సిపల్ సైంటిస్టు డాక్టర్ ప్రతిభ అన్నారు. బుధవారం బనగానపల్లె పట్టణ శివారులోని యాగంటిపల్లె కృషి విజ్ఞానకేంద్రంలో సీనియర్ సైంటిస్టు ధనలక్ష్మి ఆధ్వర్యంలో పరిరక్షణ వ్యవసాయ విధానాలపై రైతులు, శాస్త్రవేత్తలతో చర్చా కార్యక్రమం నిర్వహించారు. సైంటిస్టు ప్రతిభ మాట్లాడుతూ పరిరక్షణ వ్యవసాయం ద్వారా ప్రకృతి వనరులైన నేల, నీరు పరిమితంగా వాడి భావితరాలకు నాణ్యమైన వనరులు ఇవ్వడానికి దోహద పడుతుందన్నారు. ఈ విధానంలో నేల ఎక్కువగా దున్నకుండా పంట వేయాలని సూచించారు. కేవీకే శాస్త్రవేత్తలు మాట్లాడుతూ వర్షాకాలంలో పంట వేయడానికి ముందు నవధాన్యాలు వేసి పొలంలో కలియదున్నితే నేల సారం పెరుగుతుందన్నారు. కొర్ర, అనంతరం స్వల్పదుక్కితో శనగ, ఎత్తు మడుల్లో సోయాచిక్కుడు, అనంతరం శనగ వేసిన రైతులు అనుభవాలను వివరించారు. సమావేశంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ జాగృతి, సువర్ణ, కేవీకే శాస్త్రవేత్తలు రమణయ్య, బాలరాజు, కృష్ణమూర్తి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రూ. 1.50 లక్షల రంగు డబ్బాలు స్వాధీనం



గోడౌన్ వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్న రంగు డబ్బాలు

అవుకు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన రామక్రిష్ణ అనే వ్యాపారి గోడౌన్‌లో బుధవారం దాదాపు రూ. 1.50 లక్షలు విలువ చేసే రంగులను ఏషియన్ కంపెనీ అధికారులు, పోలీసులు కలిసి స్వాధీనం చేసుకున్నారు. రామక్రిష్ణ ఏషియన్ కంపెనీ ఏజెన్సీ తీసుకొని అవుకు పట్టణంలోని అమ్మవారిశాల వీధిలో రామక్రిష్ణ ఏజెన్సీ పేరుతో రంగుల దుకాణాన్ని తెరిచాడు. కొంత కాలం ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేకుండా కంపెనీ రంగులనే అమ్ముతూ వచ్చాడు. ఏషియన్ బ్రాండ్ ముసుగులో తక్కువ ధరలకు రంగులను ప్రజలకు అమ్ముతున్నట్లు కంపెనీ అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. పట్టణంలోని రంగుల దుకాణాల్లో కంటే రామక్రిష్ణ దుకాణంలో తక్కువ ధరకు ఏషియన్ బ్రాండ్ ఉన్న రంగులు దొరుకుతుండటంతో ప్రజలు కొనేందుకు క్యూ కట్టారు. మిగతా షాపుల ఏషియన్ ఏజెన్సీ వ్యాపారులు ఏదో గోల్‌మాల్ జరుగుతుందని కంపెనీ దృష్టికి తీసుకెళ్లారు. కంపెనీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసి వారి సహాయంతో దుకాణంలో, గోడౌన్‌లో తనిఖీలు చేశారు. గోడౌలోని రంగులను స్వాధీనం చేసుకొని వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వ్యాపారి రామక్రిష్ణను అదుపులోకి విచారణ చేస్తున్నామని, దొరికిన రంగులు కంపెనీవా లేక నకిలీవా దర్యాప్తులో తేలాల్సి ఉందని ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బనగానపల్లె, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నకిలీ వైద్యుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డ్రగ్స్ ఇన్స్‌పెక్టర్ డాక్టర్ రవికుమార్ సూచించారు. పట్టణంలో పక్షవాతానికి వైద్యం చేస్తున్నట్లు సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసుకుంటున్న సూర్యనాయుడుపై ఫిర్యాదు రావడంతో బుధవారం బనగానపల్లె ఆయుర్వేద ప్రభుత్వ వైద్యాధికారి వాణి, పోలీసులతో కలిసి ఆయన దాడులు నిర్వహించారు. స్థానికంగా ఎవరూ లేకపోవడంతో అధికారులు వెనుదిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ వైద్యం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైసీపీ నాయకుడి మృతి

బేతంచెర్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మద్దిలేటి స్వామి క్షేత్ర మాజీ ధర్మకర్త సొసైటీ మాజీ డైరెక్టర్, ఎంబాయి గ్రామానికి చెందిన బెలూం కృష్ణారెడ్డి (48) గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ నాగభూషణం రెడ్డి, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారామచంద్రుడు, జిల్లా అధికార ప్రతినిధి పుసులూరు మురళీకృష్ణ, ఎంపీటీసీ కొత్తలప్లి మునేశ్వరరెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు రుద్రవరం నారాయణ, ఎంబాయి సర్పంచ్ యుగంధర రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రసాద్ రెడ్డి, టౌన్ కన్వీనర్ పిట్టల జాకీర్ హుశేన్, వైసీపీ నాయకులు ఎద్దులన్న కృష్ణారెడ్డి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.